ప్రజాశక్తి

గురువారం 6 మార్చి 2025

5

విజయనగరం



మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ప్రజాశక్తి-విజయనగరంకోట

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8 న జిల్లాల్లో ఘనంగా వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి వేడుకలలో ముఖ్యమంత్రి పాల్గొంటారని, ఈ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేస్తారని తెలిపారు. జిల్లాల్లో ప్రజా ప్రతినిధులందరినీ ఆహ్వానించాలని, పేదరికం నుండి వచ్చి, గొప్ప వారైన మహిళలను సత్కరించాలని తెలిపారు. ఈ విసి లో జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, ఐసిడిఎస్ పీడీ ప్రసన్న, డిఎంహెచ్ఒ డాక్టర్ జీవన రాణి తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు కొరత

మార్చి నెలకు విడుదల కాని వైనం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చౌక ధరల దుకాణాల్లో కంది పప్పు కరువైంది. మార్చి నెలకు సంబంధించి ఇప్పటి వరకు విడుదల కాలేదు. దీంతో, కేవలం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. విజయనగరం జిల్లాలో 5,81,728, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,81,279 చొప్పున ఉమ్మడి విజయనగరం జిల్లాలో 8,63,007 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ప్రతినెలా తెల్ల రేషన్ కార్డుపై బియ్యం ఉచితంగాను, అర కేజీ పంచదార రూ.17, కేజీ కందిపప్పు రూ.78 చొప్పున సబ్సిడీపై పంపిణీ చేస్తున్న సంగతి తెలిసందే. ఇవన్నీ ప్రతి నెలా 1వ తేదీ నాటికే సివిల్ సప్లై గోడౌన్లకు చేరేవి. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా గ్రామాలకు సరుకులు చేరేవి. వ్యానుల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న విషయం విధితమే. కంది పప్పు విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా 20నుంచి 30శాతం కోత పెడుతోంది. ఈ మేరకు కార్డుదారులకు కంది పప్పు అందడం లేదు. వచ్చిన అరకొర పప్పులోనూ కొంతమేర పక్కదారి పడుతోంది. ఈ సంగతి అటుంచితే ఈనెలకు సంబంధించి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు ఇప్పటికీ కంది పప్పు చేరలేదు. ఏకంగా కందిపప్పు విడుదల చేయకపోవడంతో పేద, నిరుపేదలు నెలలో ఒక్కపూట కూడా పప్పు అన్నం తినే పరిస్థితి లేదు. కేజీ కందిపప్పు ధర బహిరంగ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ.120 నుంచి రూ.150 వరకు పలుకుతోంది. ఇంతమొత్తం పెట్టి తాము కప్పు కొనుక్కునే పరిస్థితి లేదంటూ పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని సమాచారం. 'నాకు మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు' అని పూసపాటిరేగ మండల కేంద్రానికి చెందిన కె.విజయకుమారి ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మన్యం జిల్లా కురుపాం, సీతానగరం మండల కేంద్రాల్లోని కొందరు రెండు నెలలుగా ఇవ్వలేదని, మరికొందరు మూడు నెలలుగా ఇవ్వలేదని చెప్పారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ఈనెల కందిపప్పు ఇవ్వలేదన్న విషయాన్ని కార్డుదారులంతా చెబుతున్నారు.

నెలిమర్లలో సరుకులు పక్కదారి

గడిచిన మూడు నెలలుగా సరుకులు సరిగా ఇవ్వడం లేదన్న ప్రజల వాదనకు తగ్గట్టుగానే రేషన్ సరుకులు (బియ్యం, పంచదార, కందిపప్పు) పక్కదారి పట్టాయి. నెల్లిమర్ల మండలం కొండవెలగాడలోని ఓ కిరాణా దుకాణంలో బయటపడ్డ అక్రమ సరుకులు ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఈ దుకాణంలో నాలుగు క్వింటాళ్లు, అర కిలో పంచదార ప్యాకెట్లు 41, కేజీ కందిపప్పు ప్యాకెట్లు 10చొప్పున బయటపడ్డాయి. ఈ మేరకు సిఎస్‌డి ఈ సరుకులు గుర్తించి, కేసు నమోదుచేశారు. ఇటువంటి సంఘటనలు ఉమ్మడి విజయనగరం జిల్లాలో నిత్యకృత్యంగా మారాయి.

ప్రత్యేక సరుకులు ఇక లేనట్టే..!

గతంలో (2014) టిడిపి అధికారంలో ఉన్నప్పుడు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండగలకు ప్రత్యేకమైన సరుకులు అందేవి. డిసెంబర్, జనవరి నెలల్లో జరిగిన ఈ పండగలకు అటువంటి సరుకులు అందుతాయని భావించినప్పటికీ ఆచరణలో అందలేదు. ఇదే విషయమై పలు సందర్భాల్లో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేదని మంత్రులు చెప్పుకొచ్చారు. ఈసారి నెలవారి ఇచ్చే సరుకుల్లోనూ కందిపప్పు కోత పెట్టడంతో తెల్లరేషన్‌కార్డులు విలవిలాడిపోతున్నారు. ఇలా చౌక ధరల దుకాణాల్లో సరుకులు తగ్గించి, ఇచ్చిన వాటిలో కోత విధించడం, ఈనెల ఏకంగా కందిపప్పు సరఫరాకు ఎగనామం పెట్టడంతో పేదలకు ఆర్థిక భారంగా పరిణమించింది.



ఎండియు వాహనం ద్వారా బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న సిబ్బంది

రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు



రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. జనవరిలో మాత్రం ఇచ్చారు. కొంతమందికి ఆ నెల కూడా ఇవ్వలేదు. మార్చి నెలకు సంబంధించిన కందిపప్పు ఇంకా రాలేదని రేషన్ విక్రయించే సిబ్బంది చెబుతున్నారు. పప్పు ధర కూడా పెరిగిపోయింది. రూ.150 పెట్టి కొనుక్కునే పరిస్థితి మాకు లేదు. మాలాంటివారు కందిపప్పు కూడా తినలేని పరిస్థితి ఏర్పడింది.

- అమరాపు రమణమ్మ, బైరిపురం, మెరకముడిదాం మండలం

ఔను..! కందిపప్పు రాలేదు



ఔను..! ఇప్పటి జిల్లాకు కందిపప్పు రాలేదు. గతంలో 1వ తేదీ నాటికి వచ్చేది. ఒక వేళ ఆలస్యం అయితే సమాచారం ఉండేది. ప్రస్తుతం సమాచారం లేదు. రాగానే సప్లై చేస్తాం.

- ఎస్.మధుసూదనరావు, డిఎస్ఒ, విజయనగరం జిల్లా



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ఇ-శ్రమ్ నమోదు వేగంగా పూర్తి చేయాలి

●బాలకార్మికులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ ●కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలోని అసంఘటిత రంగంలోని కార్మికులందరినీ ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం లేని, నెలకు రూ.15వేలు కంటే తక్కువ ఆదాయం ఉన్న వారంతా అసంఘటిత రంగ కార్మికులుగా పరిగణిస్తారని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 5 లక్షలమందిని నమోదు చేశారని, మరో 3 లక్షలు మంది వరకు ఉంటారని, వీరి పేర్ల నమోదును త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్మికశాఖకు సంబంధించిన ఈ శ్రమ్, లేబర్ సెస్ వసూలు, బాల కార్మికుల నిర్మూలన మొదలగు అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్లో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఈ శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత రంగ కార్మికులను నమోదు చేయడం ద్వారా వారికి ప్రభుత్వం పలు అందిస్తున్న పలు సదుపాయాలను వర్తింపజేయవచ్చునని సూచించారు. పేరుకుపోయిన లేబర్ సెస్ వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 1300 క్లెయిములను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎక్కడా 18 ఏళ్లలోపు పిల్లలను పనికి వినియోగించకూడదని, వారిని పాఠశాలలకు తరలించాల్సి ఉందని చెప్పారు. బాల కార్మికులను గుర్తించేందుకు వివిధ శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. వెట్టి చాకిరీ, మానవ అక్రమ రవాణాలపై ముద్రించిన పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సమావేశాల్లో ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, డిసిఎల్ ఎస్.ప్రసాదరావు, ఎసిఎల్ హెచ్‌టి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాలకు మౌలిక సదుపాయాలు ఉండాలి

జిల్లాలో ఉన్న అంగన్వాడీ భవనాల్లో మౌలిక వసతులు తప్పక ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండి టాయిలెట్ లేని , అదే విధంగా విద్యుత్ సరఫరా లేని భవనాల ఖచ్చితమైన జాబితాను వెంటనే అందించాలని ఆదేశించారు. వాటికి వెంటనే విద్యుత్, టాయిలెట్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ , విద్యా శాఖల అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేర్ ఆడిటోరియం లో ఐసిడిఎస్ శాఖ అధికారులతో బరువు తక్కువ ఉన్న పిల్లలు, బరువుకు తగ్గ ఎత్తు లేని వారి వివరాల పై, టీనేజ్ ప్రేగ్నన్సి తదితర అంశాల పై కలెక్టర్ సమీక్షించారు. ప్రతి నెల బరువులను నమోదు చేసేటప్పుడు ఖచ్చితమైన బరువులను నమోదు చేయాలనీ, అంచనాలను బట్టి వేస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమం 15 రోజుల్లో పూర్తి కావాలని తెలిపారు. సమావేశంలో ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ ప్రసన్న, డిఎంహెచ్ఒ డాక్టర్ జీవన రాణి, విద్యుత్ శాఖ ఎస్ఇ లక్ష్మణ రావు, డిపిఒ వెంకటేశ్వర రావు, సిడిపిలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు గరిష్ట వేతనం రూ.300

డ్వామా పీడీ శారదాదేవి

ప్రజాశక్తి-రామభద్రపురం

కొలతల ప్రకారం పనిచేసే ఉపాధి వేతనదారునికి గరిష్ట వేతనం రూ.300 వచ్చేవిధంగా చూడాలని డ్వామా పీడీ శారదాదేవి ఆదేశించారు. బుధవారం ఆమె రామభద్రపురం మండలంలోని దుప్పలపూడి, ముచ్చెర్లవలస పంచాయతీల్లో జరుగుతున్న పంటసంజీవిని(ఫార్మ్ పాండ్) , రింగ్ ట్రెంచ్‌లు, గోశాలల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, సాంకేతిక సహాయకులు, బిఎఫ్‌టిలతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎక్కువ గంటలు పని జరిగేలా చూడాలని, ఉదయం 6 గంటలకే పనులకు హాజరయ్యేలా చూడాలని కోరారు. ముందస్తుగా మార్కింగ్ చేసి పనులను సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో సరాసరి వేతనం తక్కువగా ఉందన్నారు. గరిష్ట వేతనం వచ్చేలా ఉపాధి సిబ్బంది మేట్లుకు, వేతనదార్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పని ప్రదేశంలో పనికి కావలిసిన పని ముట్లు , నీడ, నీరు వంటి సౌకర్యాలను ఉండేలా చూడాలన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఎఎస్ఐ ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరంకోట



త్రినాధరావును అభినందిస్తున్న ఎస్‌పి

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నగరంలోని ఒకటో పోలీసుస్టేషన్ ఎఎస్ఐ ఆల్తి త్రినాధరావు రెండు బంగారుపతకాలు సాధించారు. విశాఖలోని పెదగంట్యాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డెడ్ లిఫ్ట్ అండ్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో త్రినాధరావు 60ఏళ్ల విభాగంలో బెంచ్ ప్రెస్లో 100 కిలోలు, డెడ్ లిఫ్ట్లో 135కిలోల బరువు ఎత్తి బంగారు పతకాలు సాధించారు. గతంలో కూడా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొని పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రత్యేకంగా ఆయనను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదేస్ఫూర్తి కొనసాగించి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. త్రినాధరావును సిఐ శ్రీనివాస్, పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

●సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి● కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల సమన్వయ కమిటీ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ధర్నా చేస్తున్న రైతుసంఘాల సమన్వయ కమిటీ నాయకులు, రైతులు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, జిల్లాలో రైతులను ఆదుకోవాలని, నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని జిల్లా రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ బి.రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టం తీసుకు రావాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలని, సమగ్ర పంటల బీమా అమలు చేయాలని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల గుప్పిట్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన డిజిటల్ అగ్రి మిషన్నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్స్ నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సాయం వెంటనే రూ.20వేలు అందించాలని, పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాతావరణ పరిస్థితుల వల్ల నష్టపోతున్న జీడి, మామిడిరైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో మూత బడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని,సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు ఇచ్చి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చెయ్యాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎపి పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణ మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడు అప్పారావు, జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, కౌలు రైతులసంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, కొసిరెడ్డి నారాయణ, సిరికి వెంకట సత్య నారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు తమటపు పైడిపునాయుడు, సురేష్, రైతు సంఘం నాయకులు దేవర జగన్, రైతు సంఘం నాయకులు డేగల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆండ్ర ప్రాజెక్టు ఎడమ కాలువ మరమ్మతులు చేపట్టాలి

ఆండ్ర ప్రాజెక్టు ఎడమకాలువ చివర ఆయకట్టు రైతుల భూములకు సాగునీరు అందించేందుకు పూడికతీత, కల్వర్టులు, సపోర్ట్ గోడల మరమ్మత్తులు చేయాలని కోరుతూ రైతులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేవారు. ప్రాజెక్టు నిర్మించి 20ఏళ్లు దాటిందని, కాలువలు పాడైపోయి చివర ఆయకట్టు గ్రామాలైన మెంటాడ, సాలిపేట, కొత్తబగ్గాం పాతబగ్గాం, మధుపాడ, మరుపల్లి రైతులకు సాగునీరు అందడం లేదని అన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంవలన కాలువలు పూడికతో నిండిపోయయాన్నరు. కల్వర్టుల సపోర్టు గోడలు శిథిలమయ్యాయని తెలిపారు. ఈనేపథ్యంలో కావున కాలువల మరమ్మతులు చేపట్టి శివారు ఆయకట్టు రైతులకు నీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, రైతులు కర్రి బంగారు ఎస్ గురు నాయుడు, ఎల్ సన్యాసిరావు, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులంతా

16లోగా ఆన్‌లైన్ శిక్షణ పూర్తి చేయాలి


ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులంతా ఈనెల 16లోగా ఐగాట్ కర్మయోగి పోర్టల్ ద్వారా తప్పనిసరిగా ఆన్‌లైన్ శిక్షణ పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగుల శక్తి సామర్థ్యాలను పెంచడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల డిడిఒలతో బుధవారం నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తమ పరిధిలోని ఉద్యోగులంతా మూడు అంశాలపై తప్పనిసరిగా శిక్షణ పూర్తిచేసుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగుల ప్రవర్తన నియమావళి, పర్యావరణ అంశాలపై అవగాహన, నైతిక పాలన తదితర అంశాలపై శిక్షణలు పూర్తిచేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రణాళిక విభాగం నుంచి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొని ఉద్యోగులకు ఆన్‌లైన్ శిక్షణపై అవగాహన కల్పించారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జెఎన్‌టియుజివిలో మహిళల ఆరోగ్యంపై అవగాహనా సదస్సు, వైద్య శిబిరం నిర్వహించారు. 'ఆరోగ్యం మన హక్కు- బాధ్యత' అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవిమాధవి, మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు గురించి తెలిపారు. గైనకాలజి డాక్టర్ భార్గవి పిసిఒడి సమస్యలను వివరించారు. మెడికల్ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లక్ష్మి, ఝాన్సీ, భార్గవి, డాక్టర్ భార్గవి మహిళా ఉద్యోగినులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్. డి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.జయసుమ, మహిళా సాధికారత మరియు ఫిర్యాదుల విభాగం సమన్వయకర్త డాక్టర్ బి.నళిని తదితరులు పాల్గొన్నారు.



మెంటాడ ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సర్వశిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనలు

11న విజయవాడలో దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమ్మె ఒప్పందాల మేరకు హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీని ఏర్పాటు చేయాలని, మినిమం ఆఫ్ టైం స్కేల్, వేతనాలు పెంపు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయ వద్ద, కెజిబివి పాఠశాలల వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 11న విజయవాడలో జరిగే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మెంటాడలో కెజిబివి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, నెల్లిమర్లలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, గజపతినగరంలో రాష్ట్ర నాయకులు పి.తేజేశ్వరి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఇపిఎఫ్ అమలు, పభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబు చార్ట్, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు, గ్రాట్యూటీ అమలు, ప్రతీ నెలా 1 తేదీన వేతనాలు చెల్లింపు, ఇతర ముఖ్య విషయాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈనెల11న నిరసన దీక్ష చేపడుతున్నామని తెలిపారు. విజయనగరం మండలంలో లక్ష్మణరావు, రాము, ఎస్ కోట మండలంలో శ్రీనివాస్, సతీష్, సర్వేశ్వరరావు, గంట్యాడలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు జరిగాయి.

మా భవిష్యత్తు ఏమిటి?

వెంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థుల ఆవేదన

విసిఐ గుర్తింపు కోసం నెల రోజులుగా నిరసన

మెడికోలకు సమానంగా స్టైఫండ్ ఇవ్వాలంటూ డిమాండ్



కళాశాల గేటు వద్ద బైఠాయించిన వైద్య విద్యార్థులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

'మా భవిష్యత్ ఏంటి.. మా సమస్యలు ఇలాగే ఉంటే మా జీవితాలు ఏమవ్వాలి? కష్టపడి నాలుగేళ్లు చదువుకుంటున్నాం.. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పర్మిషన్ వస్తుందా.. లేదా.. రాక పోతే మా చదువులు ఇంతేనా' అంటూ గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ పశువైద్య కళాశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో వెబ్ కౌన్సిల్ ద్వారా విద్యార్థులకు సీట్లు కేటాయించారు. దీంతో ఈ కళాశాలలో ఐదు బ్యాచ్‌లకు సంబంధించి 320మంది విద్యార్థులు బివిఎస్‌సి చదువుకుంటున్నారు. వీరిలో నాల్గవ సంవత్సరం కోర్సు పూర్తి చేసుకొని 69మంది విద్యార్థులు ఇంటెర్న్‌షిప్ పూర్తి చేసి రిలీవ్ కానున్నారు. అయితే ఈ కళాశాలకు సంబంధించి వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు లేకపోవడంతో తమ సర్టిఫికెట్లు పని చేయవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మెడికోలుకు సమానంగా తమకు కూడా స్టైఫండ్ ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. 13 ఏళ్ల నుండి రూ.7వేలు మాత్రమే బివియస్‌సి విద్యార్థులకు స్టైఫండ్ ఇస్తున్నారని పెరిగిన ధరల దృష్ట్యా తమకు కూడా స్టైఫండ్ రూ.25 వేలు ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల 3నుంచి నిరసనలు తెలియజేస్తున్నప్పటికీ అటు పాలకులు గానీ, ఇటు అధికారులు గానీ తమ గోడు పట్టించుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల నుండి వెళ్లి పోవాలని, మెస్ కూడా ఆపేస్తున్నామంటూ మేనేజ్‌మెంట్ విద్యార్థులను బుధవారం ఆదేశించడంతో చేసేది లేక కళాశాల ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు.


కళాశాల లోపలకు సిబ్బందినిగాని, అధ్యాపకులను గాని వెళ్లనీయకుండా గేటు ముందు బైఠాయించారు. దీంతో సుమారు 11 గంటల వరకు కళాశాలలోనికి రాకపోకలు ఆగిపోయాయి. దీంతో డీన్ మక్కిన శ్రీనివాసరావు కలుగ జేసుకొని తాము లోపలకు వెళ్లకపోతే కళాశాలలోని పరిస్థితులు ఇబ్బందిగా ఉంటాయని చెప్పి విద్యార్థులతో మాట్లాడి సిబ్బందిని, అధ్యాపకులను పంపించాలని కోరడంతో విద్యార్థులు వారికి అనుమతిచ్చారు. కానీ నిరసన మాత్రం కొనసాగించారు. తమ సమ్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

సమగ్ర అభివృద్ధికి 5న సెమినార్

ఆహ్వాన సంఘం అధ్యక్షులు అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం సమగ్ర అభివృద్ధి కోసం యువకులను చైతన్య పరిచేందుకు ఏప్రిల్ 5 న పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెమినార్ ఏర్పాటు చేసినట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎస్.. అప్పలనాయుడు తెలిపారపు. బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ జిల్లాలో జూట్, పంచదార, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూత పడడంతో 50 వేల మంది కార్మికులు బతుకులు పోయాయని తెలిపారు. మెడికల్ కళాశాల లో, తగిన సిబ్బంది లేరు, సౌకర్యాలు లేవని అన్నారు. కేన్సర్ టెస్టింగ్‌సెంటర్, కార్డియాలజి, యూరాలజి వైద్యసేవలు లేవన్నారు. సాంస్కృతిక రాజధానిగా విజయనగరం పేరు గాంచినా సాంస్కృతిక విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లాలో మామిడి, జీడి, చింత పండు ప్రాసెసింగ్ పరిశ్రమలుపెట్టి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఇటువంటి ఆలోచన ప్రభుత్వాలు చేసి విజయనగరం సమగ్ర అభివద్ధి చెయ్యాలని, వ్యవసాయ రంగంలో అభివద్ధి కోసం, మురికి వాడల అభివద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఏప్రిల్ 5న జరుగనున్న సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సెమినార్ గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు వి. రామచంద్రరావు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి

ప్రజాశక్తి - గుర్ల

మాజీ ఎమ్మెల్యే పొట్నూరు సూర్యనారాయణ సతీమణి పొట్నూరు కనకమ్మ(75) బుధవారం మృతి చెందారు. ప్రస్తుతం ఆమె పాలవలస సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. మృతురాలి కోడలు ఎంపిపిగా, కుమారుడు జిల్లా వైసిపి కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. కనకమ్మ ఆకాల మరణంతో ఎంపిపి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం ఆమె ఇంటి వద్ద ఉంటుండగానే అస్వస్థతకు గురయ్యారు. సపర్యలు చేసేసరికే మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతికి మండల ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల నేతలు కార్యకర్తలు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఆర్ఎస్‌పేటలో రీసర్వే గ్రామసభ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని రామస్వామిపేట గ్రామంలో భూముల రీసర్వే గ్రామ సభను బుధవారం తహశీల్దార్ రాములమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తమకున్న భూమిపై తమకు పూర్తిగా హక్కు కలిగే విధంగా ఈ సర్వే వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. భూములు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దళారుల మాట నమ్మి మోసపోవద్దని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ డి సన్యాసినాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సచివాలయ సర్వేయర్, సర్పంచ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - బొబ్బిలి

మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా బుధవారం అభ్యుదయ పాఠశాలలో నిర్వహించిన పెయింటింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీలను డిఎస్‌పి భవ్యరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు పోలీసు వ్యవస్థ పని చేస్తుందన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం : కమిషనర్

ప్రజాశక్తి - బొబ్బిలి

శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. మున్సిపాలిటీలోని మల్లమ్మపేట, బిబిఐ కాలనీ, బాలాజీనగర్, రాజానగర్ కాలనీ శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పనకు రూ.68లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ప్రహరీ, షెడ్డు నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. అనంతరం మల్లమ్మపేటలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కాలువలలో పూడికలు పేరుకుపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పూడికలు తొలగించాలని ఆమె ఆదేశించారు. ఆమెతో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఐటిఐలో టెక్నికల్ శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో టెక్నికల్ కోర్సు శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వృత్తి నైపుణ్యం కలిగించేందుకు మూడు నెలలు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ తీసుకునే విద్యార్థులకు ఐబిఎస్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు టెన్త్ సర్టిఫికెట్, ఆధార్, ఫోన్ నెంబర్, మెయిల్ ఐడితో ఐటిఐను సంప్రదించాలన్నారు.

ప్లాన్లపై అభ్యంతరాలుంటే చెప్పండి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో పురాతన నిర్మాణాలు, ఇరుకు రోడ్లు, జన సాంద్రత ఎక్కువ ఉన్న ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు కోసం సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లాన్లు ప్రభుత్వం జారీ చేసిందని, ఆయా ప్లాన్లపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 4 సచివాలయాలలో మంజూరైన ప్లాన్లను నోటీసు బోర్డులో ప్రదర్శించారు. మున్సిపాలిటీలో 16 సచివాలయాలకు గతంలో 12 సచివాలయాలకు సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లాన్లు మంజూరయ్యాయని, మిగిలిన నాలుగు సచివాలయాలకు ప్లాన్లను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు మంజూరు చేశారన్నారు. సర్క్యులేషన్ ప్లాన్లపై అభ్యంతరాలు ఉంటే వారంలోగా లిఖిత పూర్వకంగా మున్సిపల్ కార్యాలయానికి తెలపాలన్నారు.

పాఠశాలలకు నిధులు మంజూరు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంఇఒలు నాగభూషణరావు, బాలాజీనరసింగరావు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సి.హెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని 35 పాఠశాలలకు కిచెన్ గార్డెన్ అభివృద్ధి చేయడానికి ఒక్కొక్క పాఠశాలకు రూ.5వేలు మంజూరు చేశామన్నారు. ప్రధానోపాధ్యాయులందరూ కిచెన్ గార్డెన్ అభివృద్ధి చేయాలని, పాఠశాలల నుండి వచ్చే తడి పొడి చెత్తలను వేరుచేసి కంపోస్ట్ ఎరువుగా తయారు చేసుకోవాలని, ఎరువులు కిచెన్ గార్డెన్‌లో వినియోగించాలని కోరారు. ఆకుకూరలతో పాటు కూరగాయలు, పండ్ల మొక్కలను కూడా పెంచాలని సూచించారు.

ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సమగ్ర శిక్ష ఉద్యోగులకు, హెచ్ఆర్ పాలసీ, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కూడా హెచ్ఆర్ పాలసీ, గ్రాట్యుటీ అమలు చేసి ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల అసోసియేట్ రాంప్రసాద్, అకౌంటెంట్ భరత్, ఐఇఆర్‌టిలు అప్పలనాయుడు, పురుషోత్తమనాయుడు, సిఆర్పిలు బి.వి.రమణ, ఎం అచ్చంనాయుడు, వి. ఈశ్వరరావు, జి. లక్ష్మణరావు, ఎం. రేవతి మెసెంజర్ గోవిందమ్మ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కొత్తవలస

మామిడి తోటలో సస్యరక్షణ చేపట్టాలని కీటక శాస్త్రవేత్త జి.సాహిల్ రాజ్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కాటకాపల్లి, బలిఘట్టం, చినరావుపల్లి గ్రామాల్లో మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి తోటలు పూత పిందె దశలో నుంచే పేనీ పీడ పురుగుల నుంచి మామిడి తోటలను కాపాడుకోవాలని ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా తామర పురుగులను, గొంగళి పురుగులను గమనించి వాటి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి పద్మ, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ అయ్యప్ప, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - వేపాడ

గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి. చిన్నంనాయుడు హెచ్చరించారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో మద్యం షాపులు అమ్మకానికి సంబంధించి వేలంపాట నిర్వహిస్తున్నట్లు వాట్సాప్‌లలో ఒక కథనం హల్‌చల్ చేయడంతో ఆయన బుధవారం గ్రామాన్ని ఆయన సందర్శించి విచారణ చేశారు. ఈ గ్రామంలో బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. అక్కడ గ్రామ పెద్దలతో మాట్లాడి ఈ గ్రామంలో ఏప్పుడూ బెల్ట్ షాపుల వేలంపాట నిర్వహించటం లేదని స్టేట్మెంట్ తీసుకున్నామని సిఐ తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - భోగాపురం

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన ఓదూరి గోవిందుకు సిఎం సహాయ నిధి చెక్కు రూ. 1,85,108ను ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ అండ్ నెల్లిమర్ల టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగాలవలస సర్పంచ్ బుగత లలిత, టిడిపి పార్లమెంట్ ఎస్‌సి సెల్ కార్యదర్శి ఓదూరి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు నాయకుల ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడకు పిలుపునివ్వడంతో ఇద్దరు సిఐటియు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. చలో విజయవాడను భగ్నం చేసేందుకు సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు, సురేష్‌ను పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముందస్తు అరెస్టులను దుర్మార్గమని సిఐటియు నేతలు అన్నారు.

సిఐటియులో ఆటో కార్మికులు చేరిక

ప్రజాశక్తి - జామి

ఆటో కార్మికుల సమస్యలపై ఈ నెల 10న కలెక్టరేట్ వద్ద జరగబోయే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ పిలుపునిచ్చారు. జామి, ఎస్.కోట రోడ్డులో ఉన్న స్టాండ్ ఆటో కార్మికులు బుధవారం సిఐటియులో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ కె.సురేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సిఐటియు ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. వారిని చైతన్యం చేసేందుకు నిరంతరం కృషి చేస్తుందని వారికి అండగా వారి అభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. ట్రాన్స్‌ఫోర్టు రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడి శ్రమ వెనుక దేశ ప్రయోజనాలు దాగున్నాయన్నారు. పెట్రోలు, డీజిల్ వాడుతూ రవాణా రంగం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆదాయం పెంచుతున్నామని, రవాణా సౌకర్యాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకురావడంలో చాలా కీలక పాత్ర పోషిస్తున్నామని చెప్పారు. రోజురోజుకూ నిరుద్యోగం తీవ్రతమవుతున్న కొద్దీ బతకడం కోసం ఆటోలు, క్యాబ్, లారీలు ఇతర వాహనాలలో కార్మికులు బతుకుతున్నారన్నారు. వీరిని ఆదుకోవడానికి కేరళ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారికి ఆర్థిక సహాయం



జామి : సిఐటియులో చేరిన వారితో సురేష్

చేయకపోగా అటువైపు ఆలోచించకుండా నష్టం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి అన్యాయం చేస్తున్నాయన్నారు. ఆటోలకు పార్కింగ్ స్థలాలు, స్టాండ్లు ప్రభుత్వాలు చూపడం లేదని, పెట్రోల్, డీజిల్ భారాన్ని నిరంతరం పెంచుతున్నారని, అధికారులు, పోలీసుల వేధింపులు ముమ్మరం చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో ఐకమత్యంగా పోరాటం చేసి ఆటో కార్మికులు తమ హక్కులు కాపాడుకోవాలన్నారు. మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ప్రకటించాలని, రవాణా కార్మికలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమాన్ని అమలు చేయాలని, రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న చలో కలెక్టర్ ఆఫీసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దానికి అన్ని స్టాండ్లు నుంచి కార్మికులు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అప్పల కృష్ణ, పైడిరాజు, సూర్యనారాయణ, కిషోర్, రమణ, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట జంక్షన్ దుర్గ మాంబ ఆటో స్టాండ్‌లో ఉన్న ఆటో కార్మికులంతా సిఐటియు జిల్లా ఆటో యూనియన్ కన్వీనర్ కె.సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యంలో సిఐటియు యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సిఐటియు ట్రాన్స్‌ఫోర్టు రంగంలో సిఐటియు యూనియన్ కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2019లో వాహన చట్టాన్ని తెస్తూ డ్రైవర్ మెడకు ఉరుతాడు బిగించదన్నారు. 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాకు కార్మికులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ రమణ, ట్రెజరర్ ఈశ్వరరావు, సెక్రెటరీ అప్పారావు, ఆటో యూనియన్ సభ్యులు రామారావు, చిన్న వెంకట్రావు, సంతోష్, చంద్రయ్య పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న సిబ్బంది

బొద్దాంలో నేషనల్ హైవే విస్తరణ సర్వే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో 516బి, హైవే రోడ్డు విస్తరణ సర్వే బుధవారం నిర్వహించారు. గతంలో సర్వే చేసినప్పుడు కొంతమంది పేర్లు నమోదు కాకపోవడంతో తిరిగి మళ్లీ సర్వే చేస్తున్నారు. దరఖాస్తుదారుల పేర్లు ప్రకారం సర్వే నిర్వహించి జాబితాను ఉన్నతాధికారులకు నివేదిస్తామని డిప్యూటీ తహశీల్దార్ డి. సన్యాసినాయుడు తెలిపారు. ఈ సర్వేలో మండల సర్వేయర్ గ్రామ సచివాలయం సర్వేయరు, గ్రామ రెవెన్యూ అధికారి రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విరివిగా రుణాలను మంజూరు చేయడం ద్వారా జిల్లా అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా పిఎం విశ్వకర్మ యోజనకు ప్రాధాన్యత ఇచ్చి రుణాలను మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందువల్ల వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి, వీలైనంత త్వరగా మంజూరు చేయాలని సూచించారు. స్వయంశక్తి సంఘాలకు రుణాల మంజూరు, ఇతర ప్రభుత్వ పథకాల అమలుపై సెర్ప్, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం బ్యాంకర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి వచ్చిన అన్ని ధరఖాస్తులను ఆమోదించి, వెంటనే గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా ముద్ర రుణాలను విరివిగా మంజూరు చేసి ఉపాధి కల్పించాలని సూచించారు. స్టాండప్ ఇండియా పథకం కింద ఇప్పటివరకు చేసిన మంజూరు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, యూనిట్ల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నాలుగు పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఈ మేరకు బ్యాంకర్లు కూడా తమవంతు సహకారాన్ని అందించాలని కలెక్టర్ కోరారు. వర్క్‌షాప్‌లో డిఆర్‌డిఎ పీడీ కల్యాణచక్రవర్తి, ఎల్‌డిఎం వివి రమణ మూర్తి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ ఉమామహేశ్వరరావు, ఎస్‌బిఐ ఇతర బ్యాంకుల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సర్వేలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఇళ్ల పట్టాల సర్వేకి సంబంధించి బుధవారం సాయంత్రం ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కూడా అక్కడే ఉండడంతో ఇరు వర్గాలను సర్ది చెప్పారు. గతంలో కొంతమందికి ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చారు. కానీ స్థలం చూపించకపోవడంతో 12 మంది లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వీరికి ఇంటి స్థలాలను చూపించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. రెవెన్యూ అధికారులు ఆ గ్రామంలోకి వెళ్లి స్థలాలను చూశారు. కానీ అక్కడ సర్వే చేసేందుకు ఇదివరకే స్థలాల్లో ఉన్న కొంతమంది లబ్ధిదారులు ఇటీవల అడ్డుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బుధవారం సాయంత్రం మరోసారి వెళ్లారు. ఇళ్ల స్థలాలు సర్వేకు సహకరించాలని



కోర్టు ఉత్తర్వులను వివరిస్తున్న ఎస్ఐ పాపారావు

వారందరినీ ఎస్ఐ పాపారావు కోరారు. లేదంటే కోర్టు ధిక్కారం కింద సర్వేను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇంతలో సర్వే చేస్తున్న స్థలాలు తమవని చెప్పడంతో ప్రభుత్వ పరంగా ఏమైనా పట్టాలు ఉంటే చూపించాలని ఎస్ఐ వారిని కోరారు. సర్వే చేస్తున్న స్థలాలు తమవంటూ కోర్టు ఉత్తర్వులు పొందిన లబ్ధిదారుల ముందుకు వచ్చారు. దీంతో రెండు గ్రూపుల మధ్య వివాదం నెలకొంది. చివరకు పోలీసులు సర్ధి చెప్పి సర్వేను కొనసాగించారు. ఆర్ఐ ఇమ్రాన్, సర్వేయరు మధుకేశ్వరరావు, విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నేడే తొలేళ్ల సంబరం

ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయశాఖ

ప్రజాశక్తి - జామి

ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా పిలవబడే జామి ఎల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. గురువారం తోలెళ్లు సంబరం నిర్వహించగా, శుక్రవారం జరిగే జాతరకు భారీగా జనం తరలి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వేస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పండగ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే బారికేడ్లు క్యూలైన్లు పూర్తయ్యాయి.

ఎల్లారమ్మ జాతరలో ప్రధాన ఘట్టం తోలెళ్ల సంబరం. గురువారం రాత్రి అమ్మవారి గద్దె నుంచి పూజారి ఊరేగింపుగా బయలుదేరి, ప్రధాన ఆలయ ప్రవేశం జరుగుతోంది. ఇదే లక్షలాది జన సందోహం మధ్య ఊరేగింపు ఉంటుంది. నేల డ్యాన్సులు, తప్పిడి గుళ్ళు, విచిత్ర వేషధారణలతో ఊరేగింపు సంభరంగా సాగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక, డ్యాన్స్‌బేబి డ్యాన్స్‌లు భారీగా నిర్వహిస్తారు. అమ్మవారు ఆలయ ప్రవేశం జరిగే సమయంలో భారీ మందుగుండు పేలుళ్లు అందరినీ కట్టిపడేస్తాయి. ఇలా తెల్లవారి జాము నుంచి శుక్రవారం సాయంత్రం 6గంటల వరకు జాతర సాగుతోంది. శనివారం చిన్న తీర్థం జరుగుతోంది. దీన్ని దమ్మిడి తీర్థంగా పిలుస్తారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

ప్రజాశక్తి - గుర్ల



రైతులతో మాట్లాడుతున్న జెడి రామారావు

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జెడి విటి రామారావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కెల్ల గ్రామంలో జరుగుతున్న భూధార్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉన్న రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ముందు ముందు దీని వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలిగే అవకాశం ఉందన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. వివిధ రకాల పురుగు మందులు, రసాయన ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాలన్నారు. ఇందుకోసం ప్రతి రైతు ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఆరోగ్య కరమైన దిగుబడులు సాధించవచ్చు అన్నారు. మొక్క జొన్న పైరు పై రైతులు తీసికోవలసిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మండల వ్యవసాయ అధికారి తిరుపతి రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలి

ప్రజాశకి-విజయనగరం టౌన్

దేశంలోను, రాష్ట్రంలోను కుల గణన చేపట్టాలని బిసి ప్రజా సంక్షేమ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 54 శాతం జనాభా కలిగిన బిసిలు ఎటువంటి హక్కులూ లేకుండా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కుల గణన జరగక పోవడం వలన బిసిలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలు కుల గణన చేపట్టేందుకు ముందుకు రావాలన్నారు. బిసి ల కోసం మంత్రిత్వ శాఖ పెట్టాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్ల కల్పించాలన్నారు. 23 శాతంగా ఉన్న స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లు 50 శాతాన్ని పెంచాలన్నారు. 50 ఏళ్ల పెన్షన్, బిసి మహిళలకు దాడులు నుంచి రక్షణ కోసం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు తాడి.శ్రీనివాసరావు, జాతీయ మహిళా అధ్యక్షురాలు శిరీష, డాక్టర్ తులసి కనకమహలక్ష్మి నాయకులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులుగా తాడ్డి శ్రీనివాసరావును నియమిస్తూ ధ్రువపత్రం అందజేశారు.

ప్రశాంతంగా ముగిసిన జాతర

ప్రజాశక్తి - చీపురుపల్లి

కనకమహలక్ష్మి అమ్మవారి 27వ జాతర మహోత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 2,3,4, తేదీలలో చీపురుపల్లిలో కనకమహలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయితే గతేడాది చివరి రోజు తుఫాను కారణంగా జాతరకు ఏర్పాటు చేసిన పవర్ టవర్స్, జాతరలో ఏర్పాటు చేసిన స్టేజ్, జాతరకు వచ్చిన వినోద కార్యక్రమాలకు సంబంధించిన పరికరాలన్నీ నేల కూలడంతో జాతరకు వచ్చే భక్తులను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ ఏడాది అలాంటిదేమీ లేకుండా జాతర మూడు రోజుల పాటు ప్రశాంత వాతావరణంలో జరగడంతో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు. జాతర మూడు రోజులు కూడా లక్షలాది భక్తులు జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పోలీసులు సైతం సుమారు 700 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదు. మంగళవారం రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అలరించిన మందుగుండు సామాగ్రి

చివరి రోజు ఆనవాయితీగా వస్తున్న బాణా సంచా జాతర భక్తులను ఆకట్టుకుంది. మంగళవారం రాత్రి పది గంటలకు ప్రారంభమైన బాణా సంచా రాత్రి 12 గంటల వరకు ప్రదర్శించారు. దీంతో జాతరకు వచ్చిన యువత కేరింతలతో ఉర్రూతలూగారు.

అమ్మవారి ఆదాయం రూ.24.66లక్షలు

ఈ నెల 2, 3, 4 తేదీలలో జరిగిన కనకమహలక్ష్మి అమ్మవారి జాతరకు సంబంధించి ఈ ఏడాది రూ.24,66,278లు ఆదాయం వచ్చినట్లు ఆలయం ఇఒ బి.శ్రీనివాసారావు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన యాత్రలో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఇఒ తెలిపారు. ఇందులో 23,051 మంది భక్తులు టిక్కెట్లు ద్వారా అమ్మవారిని దర్శించుకోగా ఉచిత దర్శనం ద్వారా సుమారు 40 వేల మంది వరకు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. ప్రధానంగా టిక్కెట్లు ద్వారా రూ.10,18,976లు వచ్చిందన్నారు. గతేడాది టిక్కెట్లు ద్వారా రూ.9,54,248లు వచ్చిందని గుర్తుచేశారు. ఈ ఏడాది హుండీ ద్వారా రూ.14,47,302లు ఆదాయం వచ్చిందని గతేడాది హుండీ ఆదాయం రూ.12,89,932లు వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.2,22,098లు ఆదాయం పెరిగిందని తెలిపారు. ఈ ఏడాది మూడు రోజుల పాటు జాతర సజావుగా జరిగేందుకు సహకరించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా జాతర జరిగిన మూడు రోజుల పాటు వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించేందుకు సుమారు 100 మంది వాలంటీర్లు, ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని ప్రజలు బోర్లు బాగుచేసే క్రాస్ ప్రోగ్రామ్‌ను వినియోగించుకోవాలని ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు కోరారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణా చర్యలలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం నెల్లిమర్లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీలలో ఎక్కడైనా చేతి పంపులు పాడైపోయిన కంట్రోల్ రూమ్ అధికారి పి.సుధర్శనం, పరిపాలనా అధికారి ఫోన్ నెంబర్ 9701185131కు కాల్ చేయాలని చేతి పంపులు పాడైనచోట నీరు అందించేందుకు బోర్లు రిపేర్‌కు క్రాస్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

రేగిడి: మండలంలోని గ్రామపంచాయతీలలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉంటే తక్షణమే 9502220951 నెంబర్ గల కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని ఎంపిడిఒ శ్యామల కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వేసవి నీటి ఎద్దడి దృష్టిలో ఉంచుకొని జిల్లా అధికారులు ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీటి ఎద్దడి ఏర్పడితే ఫోన్ చేసిన గంటలోనే తాగునీటి ఇబ్బందులు పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే ఆయా గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించామన్నారు.

200 రోజులు 'ఉపాధి' కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉపాధి హామీ పథకం కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కొత్తపేటలో జగ్గయ్య చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పేదలు వలసలు పోకుండా కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టిందని అయితే బడ్జెట్‌లో పథకానికి నిధులు తగ్గించి ఉపాధి కూలీలకు ద్రోహం చేస్తుందని అన్నారు. ఉపాధి నిధులను దారి మల్లించి పనిలేకుండా చేస్తుందన్నారు. కూలీలకు చట్టంలో వేతనాలు రెండు వారాల్లోగా చెల్లించాలని ఉన్నప్పటికీ గత 8 వారాలుగా వేతనాలు చెల్లించకపోతే వారు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. పని ప్రదేశంలో టెంట్లు, మందులు కిట్లు లేకుండా కూలీలు ఎండదెబ్బకు గురైతే ఎవరు భాద్యులని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి జాబ్ కార్డులు తొలగించి పనిలేకుండా చేయడం దారుణమన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న రామారావు

కచ్చితంగా కూలీలకు 200 రోజులు పని కల్పించి 600 రూపాయలు వేతనం ఇవ్వాలని చేసిన పనికి వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో కూలీలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గోడ కూలి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-చీపురుపల్లి

లారీ ఢీ కొట్టడంతో గోడ కూలి బైరెడ్డి సూరమ్మ (70) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పికె పాలవలస పంచాయతీ పరిధిలోని మెట్టబడి గ్రామంలో జొన్నలు లోడు చేసేందుకు ఎపి 05 టిజి 4743 నెంబరు గల లారీ మంగళవారం సాయంత్రం గ్రామాని వెల్లింది. అయితే లోడు పూర్తి చేసుకొని లారీని వెనుకకి నడిపే క్రమంలో ఒక ఇండి గోడకు లారీ వెనుక భాగం ఢీ కొట్టడంతో గోడ పడిపోయింది. గోడ పక్కనే ఉన్న బైరెడ్డి సూరమ్మపై గోడ కూలిపోవడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో విజయనగరం ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ చనిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని రైల్వే చిల్డ్రన్స్ పార్క్ వద్ద 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ గంగరాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ చిల్డ్రన్ పార్క్ గేటు వద్ద ఒక వ్యక్తి గంజాయి కలిగి ఉన్నాడన్న సమాచారంతో వెళ్లి పరిశీలించగా బలడా గ్రామం, నందపుర్, కోరా పుట్ జిల్లా, ఒరిస్సా స్టేట్‌కి చెందిన ఒక వ్యక్తి వద్ద అక్రమంగా 12 కేజీలు గంజాయి కలిగి ఉండడంతో అతన్ని పట్టుకుని అరెస్టు చేసి కోర్టులో హాజర పరిచామన్నారు.

6ఎ కేసు నమోదు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడ కిరాణా కొట్టులో ప్రజా పంపిణీ పిడిఎస్ సరుకులు ఉన్నట్లు సిఎస్‌డిటి గౌరి శంకర్ తెలిపారు. బుధవారం ఆయన ఆ గ్రామంలో తనిఖీలు చేపట్టగా కిరాణా వ్యాపారి మామిడి పాక మురళి ప్రసాద్ కొట్టులో పిడిఎస్ సరుకులు, బియ్యం 4 క్వింటాళ్ళు, పంచదార అరకిలో పేకెట్లు 41, కందిపప్పు కిలో పేకెట్లు 10, గుర్తించామన్నారు. అతనిపై 6ఎ కేసు నమోదు చేశామన్నారు.

దుకాణాలు సీజ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పన్ను చెల్లించని దుకాణాలను కొన్నింటిని కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. సహాయ కమిషనర్ కె.అప్పలరాజు నేతృతంలో రెవెన్యూ సిబ్బంది పన్ను వసూలు ప్రక్రియలో భాగంగా రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో కొన్ని దుకాణాలను మూసివేయించారు. దీంతో కొంతమంది తక్షణమే స్పందించి పన్నులు చెల్లించేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అప్పలరాజు, కిరణ్, వినోద్, చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు నిధులు ఇవ్వండి

ప్రజాశక్తి - బొబ్బిలి



బొబ్బిలి నియోజకవర్గంలో రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో రోడ్లు సమస్యలపై ప్రస్తావించారు. నియోజకవర్గంలో రామభద్రపురం నుంచి రాయగడ రోడ్డు పాడైపోవడంతో ఉత్తరాంధ్ర నుంచి రాయగడ వెళ్లే భక్తులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గొర్లె సీతారాంపురం నుంచి పాత బొబ్బిలి జంక్షన్ వరకు రోడ్లుపై పెద్దపెద్ద గోతులు ఉండడం వల్ల గొర్లె సీతారాంపురం వద్ద రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తన ముఖ్య అనుచరులు ధర్మతేజ, కర్రి రాకేష్ మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెర్లాం-బొబ్బిలి, పినపెంకి-ఆకులకట్ట రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

డిజిపిని కలిసిన ఎమ్మెల్యే

రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తాను బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన కలిశారు. అమరావతిలో డిజిపిని కలిసిన బేబినాయన తాను ముద్రించిన వైల్డ్ లైఫ్ టేబుల్ క్యాలెండర్‌ను అందజేశారు. అటవీ ప్రాంతంలో జంతువులకు తీసిన ఫోటోలను డిజిపి చూపించి తన అనుభవాలను పంచుకున్నారు. క్యాలెండర్‌ను చూసిన డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆనందం వ్యక్తం చేశారు.